స్థానిక సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణ బీజేపీ నేతలు మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. బస్తీల్లో తీవ్రంగా తాగునీటి సమస్య ఉందని, డ్రైనేజీ సమస్య, వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. శైలజ, కిషన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, వంశీవంజరి, ఆంజనేయులు, మురళీధర్‌గుప్తా, సర్వేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘానికి 4 దశాబ్దాలుగా విశిష్ట సేవలందించిన కె. లక్ష్మణ్ ఉద్యోగ విరమణ చేశారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, టీఎన్జీవోఎస్ నాయకులు రామ్మోహన్, రవిప్రకాష్, ఈశ్వర్, శశికాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, శివకుమార్, రవిచంద్రన్, భరత్కుమార్, శేషసాయి, గిరికాంత్, కార్తీక్, నసీమా, సత్య జ్యోతి, పాల్గొనారు.

క్లస్టర్ వాలీబాల్ టోర్నమెంట్



కీసర: ప్రతిసారి సీబీఎస్ఈ దేశవ్యాప్తంగా నిర్వహించే క్రీడా పోటీలలో సౌత్ జోన్ క్లస్టర్ -7 అండర్ -14 వాలీబాల్ టోర్నమెంట్‌లో జూబ్లి హిల్స్ పబ్లిక్‌స్కూల్ -రాంపల్లి పాఠశాల వాలీబాల్ జట్టు విద్యార్థులు సత్తాచాటి తృతీయ స్థానంలో నిలిచారు. గురువారం జూబ్లిహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ మురళీముకుంద్, డైరెక్టర్ వరలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్‌లు అభినందించారు. వారు మాట్లాడుతూ.. నల్ల మల్లారెడ్డి స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలో ఏపీ , తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 80 వాలీబాల్ జట్లు పాల్గొన్నారు. హెచ్ఎం. సుశీల, క్రీడా ఉపాధ్యాయుడు మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



మేడ్చల్: పట్టణంలోని వినాయక్‌నగర్ రోడ్డు నెంబర్-1లో జాతీయ రహదారి నుంచి కాలనీ రోడ్డులో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. వినాయక్‌నగర్ కాలనీ ప్రధానరోడ్డు ముఖద్వారంలో ఓ వ్యాపారి రోడ్డును ఆక్రమించి తమ భవనం ముందు అక్రమంగా నిర్మాణాలు చేశారని స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. ఆక్రమించిన కట్టడాన్ని తొలగించి రోడ్డును విస్తరించారు. రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

బైక్ చోరీ నిందితుల రిమాండ్



ఘట్‌కేసర్: బైక్ చోరీ నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట్ గవర్నమెంట్ క్వార్టర్స్ బతుకమ్మ కుంటకు చెందిన ఆటో డ్రైవర్ చింతల మహేష్(20), డెకరేషన్ పనిచేసే రామగల్ల శ్రీధర్ అలియాస్ నిఖిల్ (20) ఘనాపూర్‌లోని అశ్విజ వసతి గృహం వద్ద పార్కు చేసిన (ఏపీ-20 ఏజే-9394) స్ప్లెండర్ బైక్‌ను జూలై 7న భువనగిరి టీ పాయింట్ వద్ద పార్కు చేసిన గ్లామర్ బైక్‌ను 27న అపహరించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్‌పై ఎల్‌బీనగర్, ఉప్పల్ పోలీస్ స్టేషన్ బైక్ చోరీ నిందితుడు కాగా.. శ్రీధర్‌పై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉంది. నిందితులపై నల్లకుంట, ఉప్పల్, అంబర్‌పేట్, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ర్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా
- మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వినతి



సాక్షి మేడ్చల్ జిల్లా: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని.. మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీ హబ్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ర్యాంప్ (రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ పెర్ఫార్మెన్స్ స్కీమ్) ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 35 శాతం సబ్సిడీ రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. వాటితో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిని ఉపయోగించుకుని మహిళలు అనేక రకాల వ్యాపారాలు చేయడమే కాకుండా మంచి లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు.

ర్యాంప్ ప్రోగ్రాంకు ఎంపికైన వారికి బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తాం

రుణాలు తీసుకుని వ్యాపారం చేసే మహిళలకు మార్కెటింగ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రుణాల పొందుటలో ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. వాటి పరిష్కారానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ ర్యాంప్ ప్రోగ్రాంకు ఎంపికైన మహిళ వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. నేటి ఆధునిక, సాంకేతి యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమని అన్నారు.

మహిళా వ్యాపారులకు ర్యాంప్ మంచి వేదిక..

వీహబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ... ర్యాంప్ ప్రోగ్రాం వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతోందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి మహిళా వ్యాపారస్తులకు సబ్సిడీపై రుణాలు అందిస్తున్నారని తెలిపారు. రెండేళ్ల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాం మహిళా పారిశ్రామికవేత్తలకు మంచి అవకాశమని అన్నారు. తమ బిజినెస్‌ను మరింత అభివృద్ధిని చేసుకోవాడానికి ర్యాంప్ ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళా వ్యాపారులకు ర్యాంప్ మంచి వేదికని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాంబశివరావు, పీడీ మెప్మ విజయలక్ష్మి, వీహబ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సాయిరామ్, జిల్లా స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాలు అజయలక్ష్మి, డీఆర్పీ డీఎస్ అమర్‌సింగ్, జిల్లాలోని స్వయం, సహాయక సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, వీహబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవ పూజలు



నాగారం సత్యనారాయణ దేవస్థానంలో పూర్ణాహుతిలో పండితులు

కీసర: నాగారం సత్యనారాయణ కాలనీలోని రమా సహిత సత్యనారాయణస్వామి, షిరిడీసాయిబాబా, పోచమ్మ దేవస్థానం 17వ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు గురువారంతో ముగిశాయి. గురువారం దేవస్థానంలో అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, అధ్యక్షులు హరగోపాల్, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌బాబు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, రంగారావు, కోశాధికారి వాడపల్లి శ్రీనివాస్, రమేష్, లావణ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ నాగారం రాంపల్లి ఆర్ఎల్‌నగర్‌లోని నల్లపోచమ్మ, మహంకాళి అమ్మవార్ల సప్తమ వార్షికోత్సవ పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొండేటి నర్సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు శీనయ్య, కోశాధికారి కిరణ్, కమిటీసభ్యులు లావణ్య, పావని, సతీష్, సలహాదారులు సురేష్, జ్యోతి, బుద్ధవరం లక్ష్మి, కొండేటి లతారెడ్డి, శ్రీనివాసరాజు, సర్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్వాగత తోరణం పునర్నిర్మించాలి



కమాన్‌ను ఢీ కొట్టిన లారీ

శామీర్‌పేట్: అలియాబాద్ చౌరస్తాలోని సీతారామ చంద్రస్వామి కమాన్ (స్వాగత తోరణం) వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ లో పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారికి అనుకొని ఉన్న అలియాబాద్ చౌరస్తా వద్ద కమాన్‌ను దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. కాగా బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన లారీ కమాన్‌ను ఢీ కొట్టడంతో ధ్వంసమైంది. దీంతో పురాతనమైన దేవాలయ కమాన్‌ను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని గురువారం శామీర్‌పేట పోలీసులకు వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ జీవితంలో భాగం కావాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యనభ్యసించే విద్యార్థులకు లాప్‌టాప్ నాలుగేళ్ల పాటు జీవిత భాగస్వామిగా కావాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్‌డేలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారత యువ ఇంజినీర్లకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. యూనివర్సిటీ వీసీ మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి గ్రూప్స్ అధ్యక్షులు భద్రారెడ్డి, ప్రిన్సిపాల్ చిన్నం యువరాజ్,రిజిస్ట్రార్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై 'ప్రీ మాన్‌సూన్' స్పెషల్ డ్రైవ్

కాప్రా: వర్షాకాల ముందస్తు చర్యల్లో భాగంగా కాప్రా సర్కిల్ అధికారులు 4వ విడత ప్రీ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గురువారం ఏఎస్‌రావునగర్ డివిజన్ అనుపురం కాలనీ, కాప్రా డివిజన్ శ్రీరాంనగర్ కాలనీ, అశోక్‌నగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వర్షాలతో రోడ్లపై పేరుకుపోయిన ఇసుకమేటలు, చెత్తను తొలగించారు. అనంతరం దోమల నివారణకు రోడ్లకు ఇరువైపుల, ఖాళీస్థలాలు, డ్రైనేజీల్లో లార్వాను గుర్తించి స్ప్రే చేశారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేందర్, డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, టౌన్‌ప్లానింగ్ డీసీపీ కృష్ణమోహన్, యూసీడీ సెక్షన్ డీపీఓ దామోదర్ రెడ్డి, డీసీఎస్‌డబ్ల్యూఎం గోపాల్, ఏఎంహెచ్ఎంఓ మధుసూదన్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం పారిశుద్ధ్య కార్మికులు అల్వాల్ సర్కిల్ లక్ష్మికళా థియేటర్ రోడ్డు సిబ్బందిచే డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించారు. వెంకటేష్, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులున్నారు.

కాగితానికే పరిమితమా?

ఇంటి స్థలం నిషేధిత స్థలంలో ఉందని ఆవేదన



మంజూరు పత్రాన్ని చూపుతున్న హేమలత

పోచారం: ఇందిరమ్మ ఇల్లు మంజూరుకావడంతో ఉన్న రేకుల ఇంటిని కూల్చివేసి పక్కా ఇల్లు కట్టుకోవాలని ఓ ఒంటరి మహిళ ఆశ పడింది. ఆమె ఇంటి స్థలం నిషేధిత జాబితాలో ఉందని అధికారులు చెప్పడంతో షాక్‌కు గురైంది. గురువారం ఆమె మాట్లాడుతూ.. కొర్రెముల్, ఏకశిలానగర్‌లో 50 చదరపు గజాల స్థలంలో ఇంటినెంబర్ 10-546తో రేకుల ఇళ్లు ఉండేదని చెప్పారు. పదేళ్లుగా అదే ఇంట్లో ఉంటున్నానని, ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పక్కా ఇల్లు కట్టుకునేందుకు దాన్ని కూల్చివేశామన్నారు. అద్దె ఇంట్లో ఉంటూ.. సొంతింటి నిర్మాణం కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నానని చెప్పారు. తీరా ముగ్గు పోసే సమయంలో తన స్థలం నిషేధిత భూముల జాబితాలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నట్లు వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదామని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం చెంగిచర్లలోని స్కూల్ విద్యార్థులు వనమహోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరం హరితవనంగా మార్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు మొక్కలు నాటాలని సూచించారు. ప్రిన్సిపాల్ నీలిమా, వైస్ ప్రిన్సిపాల్ ఉషాదేవి పాల్గొన్నారు.

పచ్చని తెలంగాణే లక్ష్యంగా వనమహోత్సవం



మొక్కను నాటుతున్న ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి తదితరులు

కీసర: రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం చేపట్టిందని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక వన మహోత్సవంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర వార్డు కార్యాలయం ఆవరణలో తటాకం వెంచర్ వద్ద కీసర ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలన్నారు. అనంతరం డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల రాకుండా అవగాహన, తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, ఆశావర్కర్లు, స్నేహ మహిళ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కూతురి జన్మదినం.. పేద విద్యార్థులకు సాయం



మేడ్చల్: ఎల్లంపేట్ శ్రీరంగవరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ శైలజ, మాజీ సర్పంచ్ విజయానంద్‌రెడ్డి దంపతులు కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ప్లేట్లు గ్లాసులు అందజేశారు. గ్రామ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న 400 మంది విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. నాయకులు మనస్వినిరెడ్డి, సుకన్య, పెంటారెడ్డి, ప్రకాష్, ప్రకాష్‌రెడ్డి, నర్సింహ్మా, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'పేదల ఇళ్లు కూల్చడం సరికాదు'

జవహర్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వమంటే ఇళ్లను కూల్చే ప్రభుత్వంగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ సంతోష్‌నగర్‌లో ఓ గిరిజన కుటుంబం 40 గజాల పాత ఇంటిని కూల్చి.. కొత్తగా నిర్మించుకుంటే రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణమంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న సుదర్శన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు విచారణ చేయకుండా పోలీస్ బందోబస్తుతో ఇళ్లు కూల్చుతామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నాయకులు కమల్, రామునాయక్, బాబు, సంతోష్‌గుప్తా, యాదగిరియాదవ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

భూలక్ష్మి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో గోసాయిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన భూలక్ష్మిదేవి ఆలయంలో మూడ్రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, నాయకులు మహేష్, స్వామియాదవ్, జైపాల్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

మేడ్చల్: మున్సిపాలిటీ గోసాయిగూడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భూలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. గ్రామస్తులు నిర్మించిన ఆలయంలో వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, మండల కాంగ్రెస్ నేతలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

మర్యాద పూర్వక కలయిక



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలస్వామిని పలువురు కాంగ్రెస్ నేతలు గురువారం శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, అనిత, అంజిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, రవి, గోపాల్‌గౌడ్, రత్నం పాల్గొన్నారు.



మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్

కీసర ఇన్‌స్పెక్టర్‌తో బీజేపీ నేతలు..

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులను గురువారం నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా..!

మార్కెట్ రోడ్డులో తిరిగి రోడ్లపైకి వ్యాపారాలు ● డివైడర్ మధ్యలోనే తిరిగి వాహనాల పార్కింగ్



వివేకానంద విగ్రహం వద్ద రోడ్లపై..



మార్కెట్ రోడ్డులో రోడ్లపై పూల దుకాణాలు

మేడ్చల్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో వాహనదారులు సులువుగా వెళ్లేందుకు అధికారులు చేపట్టిన చర్యలు 'మున్నాళ్ల మచ్చటే'గానే మిగిలాయి.

6 నెలల క్రితం ఆక్రమణల తొలగింపు..

మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా మార్కెట్ రోడ్డులోని ఆక్రమణలను తొలగించి మధ్యలో తాత్కాలిక డివైడర్‌ను ఏర్పాటు చేసి వివేకానంద విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు చేపట్టిన పనుల్లో పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డులో ఆక్రమణలు తొలగించిన అధికారులు..

అంబేడ్కర్ విగ్రహం నుంచి వేంకటేశ్వర మెడికల్ వరకు కోర్టు సమస్యలతో రోడ్డు విస్తరణ జరగలేదు. 6 నెలల క్రితం అధికారులు రెండు రోడ్లలో దుకాణాల ముందున్న ఆక్రమణలను తొలగించారు. వాహనాలు నిలపకుండా తాత్కాలిక డివైడర్లు ఏర్పాటు చేసి వాహనదారులకు మార్గం సుగమం చేశారు. చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు నష్టపోకుండా రైతుబజారు వద్ద రైల్వేస్టేషన్ రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని అక్కడకు తరలించారు.

తిరిగి రోడ్లపైకి..

వివేకానంద విగ్రహం వద్ద, మార్కెట్ చౌరస్తాలో పూల,పండ్ల వ్యాపారులు తమ వ్యాపారాలను చేస్తూ రోడ్డును ఇరుకుగా మార్చే యత్నం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చిరువ్యాపారుల దుకాణాలతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.

ఇష్టానుసారంగా పార్కింగ్‌లు..

మార్కెట్ రోడ్లలో వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్‌లు చేస్తుంటడంతో మార్కెట్‌లో మరోసారి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. పోలీసులు ఫోటోలు తీసి చలాన్లు విధిస్తున్నా.. అక్రమ పార్కింగ్‌ల తీరు మారడం లేదు.

మార్కెట్ రోడ్డులో పార్కింగ్ చేస్తే తగిన చర్యలు



మార్కెట్ రోడ్డులో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డులో చిరు వ్యాపారాలను తొలగించి సమస్యను పరిష్కరించాం. వాహనదారులు తమ వాహనాలను పార్క్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చట్టం ప్రకారం చలాన్లు విధించడం, సీజ్ చేయడం వంటి చర్యలు ఉంటాయి.

– హనుమాన్‌గౌడ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

రోడ్లపై వ్యాపారాలు వద్దు



మార్కెట్ రోడ్డులోగాని, ఇతర రోడ్లలో గాని ఇతరులకు ఇబ్బందులకు కలిగిస్తూ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.చిరు వ్యాపారులకు రైతు బజారు వద్ద స్థలం కేటాయించాం అక్కడే వ్యాపారాలు చేసుకోవాలి. మార్కెట్ రోడ్డులో రోడ్లపై బండ్లు పెట్టి ట్రాఫిక్ సమస్య కలిగేస్తు ఉపేక్షించేది లేదు.

– చంద్రప్రకాశ్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్